## జప్తు వస్తువులు పొందే విధానం సరళతరం

- **కేంద్ర డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్**

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో పోలీసు అధికారులు, ఇతర ఏజెన్సీలు జప్తు చేసే నగదు, ఇతర వస్తువులకు వాస్తవికత ఉంటే వారు తిరిగి పొందే విధానాన్ని సరళతరం చేయాలని కేంద్ర డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్ ఆదేశించారు. వారి వస్తువులు వారు పొందే వెసులుబాటుపై ఈసారి ముందస్తుగా ప్రచారం కల్పించాలని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఈవో ఆఫీసులో జరిగిన విస్తృతస్థాయి సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర శాసనసభకు ఇటీవల జరిగిన ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన రాష్ట్ర బృందం కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## 6,100 పోస్టులతో ఏపీ డీఎస్సీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసింది. 6,100 ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 2,280 ఎస్జీటీ పోస్టులు, 2,299 స్కూలు అసిస్టెంట్ పోస్టులు, 1,246 టీజీటీ పోస్టులు, 215 పీజీటీ పోస్టులు, 42 ప్రిన్సిపల్ పోస్టులు భర్తీచేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 12 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించి, ఏప్రిల్ 7న ఫలితాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.














